క్లుప్తంగా

పోషకాహారం పంపిణీ



పోషకాహారం అందిస్తున్న రోటరీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని లంకలకోడేరు గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. దాత వేగేశ్న సూర్యనారాయణరాజు గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. గర్భిణులు పుట్టే శిశువులు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అడ్డాల ప్రతాప్‌కుమార్, నవ్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, కఠారి నాగేంద్రకుమార్, మద్దాల వాసు, యిమ్మిడి రాజేష్, గుడాల హరిబాబు, జవ్వాజి కళ్యాణ్, ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల ఓ ప్రమాదంలో కాలుకు గాయమైన పాలకొల్లుకు చెందిన జి.సరస్వతికి వైద్యం నిమిత్తం రూ.18,500 ఆర్థిక సాయం మంగళవారం అందజేశామని జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గెద్దం సునీల్ గవాస్కర్ తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి నెలా పదో తేదీన విద్య, వైద్యం నిమిత్తం ఒక కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు రాయపూడి భవానీప్రసాద్, ఈదుపల్లి శ్రీధర్, సతీష్, హరీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడలిలో యోగాంధ్ర



వడలిలో యోగాంధ్రలో పాల్గొన్న గ్రామస్తులు

పెనుగొండ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వడలిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం పంచాయతీ ఆవరణలో యోగాతో ఆరోగ్యం సమకూరుతుందని, యోగా ఆవశ్యకతను వివరించారు. పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరికి పంచ హారతులు



వశిష్ట గోదావరికి హారతులు ఇస్తున్న భక్తులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా వశిష్ట గోదావరికి హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో కలగ భద్రుడ స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఏకముక, ద్విముఖ, చతుర్థ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ కుంభ, సర్ప హారతులు ఇచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

వృద్ధునికి ఆర్థిక సాయం



వృద్ధునికి నగదు అందిస్తున్న కాస్మో సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన వృద్ధుడు యు.రాఘవేంద్రరాజుకు స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేలు సాయం అందజేశారు. కాస్మో సంఘ కార్యదర్శి దండు గోపాలకృష్ణంరాజు, కలిదిండి గణపతి రాజు, గాదిరాజు సుబ్బరాజు, కోసూరి వెంకట సుబ్బరాజు, బుద్ధరాజు పాల్గొన్నారు.

26 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన 26 మంది వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేశారు. వృద్ధులు ఆహార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నడక వంటి వాటిపై అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ వైద్యపరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం

- కూటమి ప్రభుత్వం తీరుపై ప్రజల అసంతృప్తి
- వైఎస్సార్ సీపీ హయాంలో నరసాపురం మున్సిపాలిటీకి ప్రాజెక్ట్ మంజూరు
- మంచినీటి పైప్‌లైన్ల ప్రక్షాళనకు రూ.81.81 కోట్లు
- రూ.61.81 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- ప్రస్తుతం అయోమయంలో ప్రాజెక్ట్



భారీ విస్తీర్ణంలో ఉన్న నరసాపురం మంచినీటి కులాయిచెరువు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన భారీ ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా వెనక్కి వెళుతున్నాయి. నరసాపురం మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునీకీకరించడంతో పాటుగా అదనంగా ఓహెచ్ ఆర్‌ల నిర్మాణానికి వీలుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 నవంబర్‌లో రూ.81.81 కోట్లతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ నిర్మించాలని నిర్ణయించింది. ప్రాజెక్ట్‌కు సంబంధించి సాంకేతిక అనుమతులిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జీఓ నెంబర్ 15 విడుదల చేసింది. ముందుగా ప్రాజెక్ట్ నిమిత్తం రూ.61.81 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడతలో పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. అయితే కూటమి ఏడాది పాలనలో ఈ ప్రాజెక్ట్ విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం.

ప్రాజెక్ట్ నిర్మాణం ఇలా..

పట్టణంలో ప్రస్తుతం మూడు ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం పట్టణంలో 96 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌లు 1966 సంవత్సరంలో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా దాదాపు మరో 30 కిలో మీటర్ల మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించతలపెట్టింది. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించే విధంగా ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణంలో ఇక మరో 30 ఏళ్ల వరకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే ప్రజల ఆనందం కూటమి సర్కార్ నిర్లక్ష్యం వల్ల ఆవిరయ్యింది.

పనుల నిలుపుదల దారుణం



స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ నిమిత్తం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్కా జీఓతో నిధులు విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. మున్సిపాలిటీలో అప్పటి ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో శాశ్వత అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ఎప్పటి నుంచో సమస్యగా ఉన్న పైప్‌లైన్ల ఆధునికీకరణకు అప్పటిలో మేము పూనుకున్నాం. పనులు నిలిచిపోవడం దారుణం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు



భక్తాంజనేయస్వామి

యలమంచిలి: జ్యేష్ట శుద్ధ చతుర్దశి సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో అభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగు రైతులంతా కౌలు కార్డు పొందాలి



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ దేవి

యలమంచిలి: కౌలు వ్యవసాయం చేసే ప్రతి రైతూ ఖచ్చితంగా కౌలు కార్డు పొందాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి సూచించారు. ఇలపకుర్రు గ్రామ సచివాలయంలో మంగళవారం కౌలు రైతు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దేవి మాట్లాడుతూ కౌలు కార్డు కోసం సాగుచేసే రైతు తన ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సొంత రైతు పొలం పాస్ బుక్ జిరాక్స్, అతని ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకుని రైతు సేవా కేంద్రంలో ఇన్‌చార్జి వద్దకు వెళ్లి దరఖాస్తు పూర్తి చేసి ఇస్తే కౌలు కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ విషయంలో సొంత రైతు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా కౌలు రైతుకి సహకరించాలని ఆమె కోరారు. కౌలు కార్డు ఉంటేనే కౌలు రైతులు పండించిన పంట నమోదు చేయించుకోవడానికి వీలవుతుందన్నారు. దీని వల్ల సొంత రైతుకు నష్టం ఉండదని, భూమిపై సర్వహక్కులూ సొంత రైతుకు మాత్రమే ఉంటాయని వివరించారు. పండించే పంటపై మాత్రమే కౌలు రైతుకు హక్కు ఉంటుందని, కౌలు కార్డు కూడా 11 నెలలు మాత్రమే అమలులో ఉంటుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ కొండేటి జీవరత్నం, అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

మార్టేరు - పెనుగొండ రోడ్డులో రాకపోకలు ప్రారంభం



కంకర గుట్టలు తొలగించడంతో తిరుగుతున్న వాహనాలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నెగిపూడి వద్ద నర్సాపురం కాలువ నుంచి పంట బోదెకు రూ.59 లక్షలతో కల్వర్టు నిర్మించేందుకు నెల రోజుల క్రితం ఆర్ అండ్ బీ అధికారులు రోడ్లు మూసివేశారు. దీంతో నెల రోజులుగా ఆ రహదారిని వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే మంగళవారం సాయంత్రం కల్వర్టు వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్ల గుట్టలను తొలగించడంతో వాహనాలు రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. అయితే ఆర్టీసీ అధికారులకు ఎటువంటి అధికారిక ప్రకటన ఇవ్వకపోవడంతో ఆర్టీసీ బస్సులు మాత్రం ఆలమూరు, ఆచంట మీదుగా నడుపుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



తూర్పుతాళ్లు పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న డాక్టర్ గీతాబాయి

నరసాపురం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం నరసాపురం మండలం ఎల్బీచెర్ల, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. క్యాన్సర్ తదితర రోగ నిర్ధారణ (ఎన్‌సీడీసీడీ) పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే తీరు, ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఓపి రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో వైద్యులు మావూరి మాధురి, చిరంజీవి, జెరూష తదితరులు ఉన్నారు.

సాగులో పాముల భయం

- పెనుగొండ మండలంలో కార్మికులకు పాము కాట్లు
- వ్యవసాయ పనులకు వచ్చేందుకు హడలిపోతున్న వైనం



పెనుగొండ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న బెంగాలీ కార్మికుడు



రక్త పింజరి పాము

పెనుగొండ: మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో పాములు వ్యవసాయ కార్మికులను భయపెడుతున్నాయి. గత ఏడాది వరుస పాము కాట్లతో కార్మికులు ఇబ్బందులు పడడంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి హడలెత్తిపోతున్నారు. పెనుగొండ మండలంలో ఇటీవల పాము కాటుకు పలువురు బెంగాలీ కార్మికులు గురయ్యారు. ముఖ్యంగా రక్త పింజరిలు పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వచ్చే కార్మికులను కాటు వేస్తున్నాయి. వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ నుంచి కార్మికులను అధిక సంఖ్యలో ఆచంట నియోజకవర్గానికి తీసుకొస్తుంటారు. వీరో ఒక్కో బంటాకు 20 నుంచి 30 మంది కార్మికులు ఉంటారు. వీరు వరినాట్లు పూర్తి చేసిన అనంతరం వరి చేల వద్దే ఏర్పాటు చేసిన మకాంలలో విశ్రాంతి తీసుకొంటారు. వీరు పాము కాటుకు గురవుతున్నారు. వీరితో పాటు పలువురు రైతులూ పాము కాటుకు గురవుతున్నారు. వడలిలో ఇటీవల ఓ బెంగాలీ కార్మికుడిని పాము కాటు వేయడం వైద్యం అందిలోపునే మృతి చెందాడు. దేవలో ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువలు బాగు చేస్తుండగా మహిళా కార్మికురాలు పాముకాటుకు గురైంది. ఇలా సుమారు 20 నుంచి 30 మంది వరకు పాము కాటుకు గురైనా సకాలంలో వైద్యం చేయించుకోవడంతో బతికి బట్టకట్టారు. పెనుగొండ శివారు చిన్నంవారి పాలెం, వడలి ప్రాంతాల్లో పలువురు రైతులు పాము కాటుకు గురయ్యారు. పాము కాటు గుర్తించిన వారు సకాలంలో వైద్యం తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆలస్యం చేసిన వారు పెనుగొండ, సిద్ధాంతం ఆసుపత్రిల నుంచి తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రిల వరకు వైద్యం కోసం వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో పాముల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వర్షాలు పడితే పాములు వస్తాయంటూ రైతులు, కార్మికులు హడలెత్తిపోతున్నారు.

బెంగాలీ కార్మికులకూ బీమా చేయాలి



జీవనోపాధికోసం వచ్చి పాము కాటుకు గురవుతున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. బెంగాలీ కార్మికులను తీసుకొచ్చే వారు కార్మికులకు బీమా చేయించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటు మందు సిద్ధంగా ఉంచాలి. ప్రాణాపాయం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎస్ వెంకటేశ్వరరావు, సీఐటీయూ

ముగిసిన శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కొంతేరులో చక్రస్నానం అనంతరం స్వామి వారి పల్లకీ సేవ

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వైకానస ఆగమ ప్రకారం శుక్రవారం నుంచి ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారం ముగిశాయి. అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో పండితులు పాలమూరు మాధవ చార్యులు ఉదయం స్వామికి పూర్ణాహుతి, చక్రస్నానం, పంచామృతాభిషేకం మధ్యాహ్నం పల్లకీపై స్వామి గ్రామోత్సవం, రాత్రి పుష్ప యాగం కనుల పండుగగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేశారు. మహిళ భక్తులకు అమ్మవారికి పూజ చేసిన పసుపు, కుంకుమ, గాజులు ప్రసాదంగా అందజేశారు. పుష్పయాగం తరువాత ఆలయం వద్ద భక్తులు చేసిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

కాళ్ల: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రైతులు కోరారు. కాళ్ల మండలం పెదఅమీరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల అమెరికా యాంటీ డంపింగ్ డ్యూటీని పెంచడంతో రొయ్యల అన్ని కౌంట్‌ల ధరలు రూ.10 తగ్గించారని, ఈ భారం రైతులపై పడకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రూ.1.50 పైసలు విద్యుత్ సబ్సిడీని వెంటనే అమలు చేయాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకున్న వారికి కూడా సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. వీటితో పాటు మేతల ధరలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వీటన్నింటిపై విజయవాడలో జరిగే కమిషనర్ ఆఫీస్ మీటింగ్ లో చర్చించి తదుపరి ముఖ్యమంత్రితో కూడా మాట్లాడి ఆక్వా రైతులు సమస్యలు పరిష్కరించేలా చూస్తానని రఘురామకృష్ణంరాజు తెలిపారు.

యోగా పోటీలను విజయవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాస్థాయి యోగా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యోగాంధ్ర 2025లో భాగంగా యోగా ప్రదర్శనలు, పోటీలు, యోగా అభ్యాసం పట్ల ప్రజలలో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక యోగ కార్యక్రమాలను, ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ, మండల స్థాయిలలో నిర్వహించిన యోగ పోటీలలో గెలుపొందిన వారికి భీమవరం పట్టణం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం నందు జూన్ 10 నుంచి మూడు రోజులు పాటు జిల్లాస్థాయి యోగ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి



పెంటపాడులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెంటపాడు: కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని, తక్షణమే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణ రావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పెంటపాడు ఆర్యవైశ్యసేవసంఘ భవనంలో సీపీఐ మండల మహాసభ కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. విశాఖ ఉక్కు కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. బండారు శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు దిద్దే నాగేశ్వరరావు, ఉయ్యూరు సత్యనారాయణ, కొణతాల నాగరాజు, ముమ్మిడివరపు వెంకటలక్ష్మి, యండ్రపు అప్పాయమ్మ, దేపల్లి సుబ్బారావు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు



పెనుగొండ : కిశోర వికాస కార్యక్రమం

పాలకొల్లు సెంట్రల్: బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల్లో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.సత్యవేణి అన్నారు. మంగవారం స్థానిక బ్రాడీపేట సచివాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలకు విద్య, ఆహారం, రుతుక్రమ పరిశుభ్రత, రక్తహీనత, పోక్సో చట్టం, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ, బాలికల నాయకత్వం, వ్యాయామాలు, బాల్య వివాహాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బండి దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిషేధం

పెనుగొండ: బాల్యవివాహాలు జీవితాన్ని చిదిమేస్తాయని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజరు జి.సుజాత అన్నారు. మంగళవారం పెనుగొండ సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఆధ్వర్యంలో కిశోర్ వికాసం తరగతుల ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలతో పాటు, అవగాహన సమస్యలు ఉంటాయన్నారు. కారర్యక్రమంలో ఏఎన్ఎం కె.వాసుదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

యలమంచిలి: బాల్య వివాహాలు అనర్థమని, వాటిని సమర్థంగా అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. యలమంచిలి అంగన్‌వాడీలో మంగళవారం నిర్వహించిన కిషోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి కిషోర బాలిక చదువుపై శ్రద్ధ పెట్టి జీవితంలో స్థిరపడిన తరువాత పెళ్లి గురించి ఆలోచించాలన్నారు. అదే సమయంలో మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంగమ్మ, పీహెచ్ఎస్ మార్తమ్మ, ఆశ కార్యకర్త ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, దేవి, లక్ష్మీ, రమాదేవి, జ్యోతి, రజని మహిళ పోలీస్ స్నేహ కిషోర బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్ : ర్యాలీలో పాల్గొన్న కిశోర బాలికలు



యలమంచిలి : కిశోర వికాసంలో మాట్లాడుతున్న మహ్మద్ హసీనా